క్లుప్తంగా

మహిళా సాధికారతతో సమాజ పురోగతి



మహిళకు మందులు అందిస్తున్న డాక్టర్ పద్మావతి

బోట్‌క్లబ్: ప్రతి మహిళ సాధికారత సాధించడం ద్వారా సమాజం పురోగతి సాధ్యమవుతుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక నాగమల్లి తోట వద్ద ఉన్న శ్రీసత్య దంత వైద్యశాలలో సోమవారం మహిళా సమానత దినోత్సవం సందర్భంగా మహిళలకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యంపై అవగాహన కలిగించారు. సమాజంలో మహిళల పాత్ర ఎంతో ఔన్నత్యమైందన్నారు. కుటుంబం బాగుండాలన్నా, దేశం ప్రగతి సాధించాలన్నా మహిళల వల్లే సాధ్యమవుతుందన్నారు. అటువంటి వారిపై జరుగుతున్న దారుణాలను నివారించేందుకు సమైక్య కృషి జరగాలన్నారు . సంఘ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ భవిష్యత్తు తరాలను ప్రోత్సహించాలని, ప్రతిచోటా మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు, హక్కులు ఉన్నాయన్నారు. మహిళలపై వేధింపులకు పాల్పడుతున్న వారికి కఠిన శిక్షలు త్వరితగతిన అమలయ్యేలా చట్టాలు తీసుకురావాలని కోరారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న శుభకర్ రెడ్డి

కాకినాడ లీగల్: రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావాలని సబ్ జైలు ఉద్యోగి అనిశెట్టి శుభకర్ రెడ్డి అన్నారు. ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన సోమవారం కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేశారు. ఈయన ఇప్పటివరకు 25 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కాకినాడ స్పెషల్ సబ్ జైల్లో ఆయన వార్డర్‌గా పనిచేస్తున్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం వల్ల అనేక మందిని ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని ఆయన తెలిపారు. యువత మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, సమాజానికి ఉపయోగపడాలని కోరారు. రక్తదానం చేసిన శుభకర్ రెడ్డిని ఫ్రెండ్స్ ఫౌండేషన్ అధినేత కూనిశెట్టి మణికంఠ రెడ్డి, పలువురు ఉద్యోగులు అభినందించారు.

జొన్నలగడ్డకు మదర్ థెరిసా జాతీయ అవార్డు



విజయవాడలో అవార్డు అందుకుంటున్న జొన్నలగడ్డ రాజు

కరప: మండలంలోని గురజనాపల్లి గ్రామానికి చెందిన మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజుకు మదర్ థెరిసా జాతీయ అవార్డు లభించింది. భారత రత్న మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని, మదర్ సర్వీస్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలోని మదర్ థెరిస్సా గ్రంథాలయం ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో వివిధ జిల్లాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులకు ఈ అవార్డులను అందజేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాడి ప్రసాద్‌రావు, ఇతర ప్రతినిధులు ఈ అవార్డును జొన్నలగడ్డకు ప్రదానం చేశారు. ఈయనను గురజనాపల్లి సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తదితరులు అభినందనలు తెలిపారు.

మహిళల భద్రత కోసమే దిశ



సదస్సులో మాట్లాడుతున్న సీఐ పెద్దిరెడ్డి రామచంద్రరావు

కాకినాడ క్రైం: మహిళలు, బాలికల భద్రత కోసమే దిశ పనిచేస్తుందని కాకినాడ దిశ స్టేషన్ సీఐ పెద్దిరెడ్డి రామచంద్రరావు అన్నారు. మహిళా చట్టాలు, భద్రత అంశాలపై సీఐ ఆధ్వర్యంలో స్థానిక జగన్నాథపురంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో హైస్కూల్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎస్సై లక్ష్మీకాంతం డయల్ 100 దిశ యాప్ ఆవశ్యకతను విద్యార్థినులకు వివరించారు. వివిధ మహిళా రక్షణ చట్టాలు, వాటిలో ఉండే అంశాలు, ఆయా చట్టాల వల్ల మహిళలకు చేకూరే ప్రయోజనాన్ని సీఐ రామచంద్రరావు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలపై జరిగిన పలు ఘోరాలను వివరిస్తూ, మైనర్లను సంరక్షించేందుకు పోక్సో చట్టం ఉందని చెప్పారు. కోల్‌కతా వైద్య విద్యార్థినిపై జరిగిన ఘోరాన్ని ప్రస్తావిస్తూ, ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.



వైద్యులు దైవంతో సమానం.. రక్షణ కల్పించాలి

వైద్య వృత్తిని నమ్ముకుని, ఎందరివో ప్రాణాలు నిలిపే వైద్యులు దైవంతో సమానం. వైద్యులను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. వారికి రక్షణ కల్పించాలి. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై అఘాయిత్యం సభ్య సమాజానికి సిగ్గు చేటు. ఇటువంటి సంఘటనలను మొగ్గలోనే తుంచాలి. వైద్య వృత్తిలో ఉన్న మహిళలకు రక్షణ ఇవ్వడం వలన వారు అంకితభావంతో, ధైర్యంగా పనిచేయగలుగుతారు. కోల్‌కతా ట్రైనీ వైద్యురాలి సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ శ్రీను చంద్ర, వైద్యురాలు, గైగోలుపాడు అర్బన్ హెల్త్ సెంటర్, కాకినాడ



దోషులకు తగిన శాస్తి జరగాలి



వైద్య విద్యార్థిని మరణాన్ని అడుగడుగునా హేళన చేస్తున్నారు. న్యాయస్థానంలోనైనా న్యాయం జరుగుతుందనుకుంటున్న బాధితురాలి తల్లిదండ్రులు, దేశ ప్రజల ఆశలపై నీళ్లు చల్లుతున్నారు. కోల్‌కతా హైకోర్టులో నిందితుడి తరఫు వాదిస్తున్న లాయర్లు వేసిన రిట్ పిటిషన్ దేశ ప్రజల దౌర్భాగ్యానికి పరాకాష్ట. పచ్చి అబద్ధాలతో రిట్ వేసి, కోర్టునే తప్పుదోవ పట్టించాలనుకోవడం ఎంత దారుణం. మాతోటి వైద్యురాలికి జరుగుతున్న అన్యాయం చూస్తుంటే ఆవేదన కలుగుతోంది. దోషులకు తగిన శాస్తి జరగడానికి ప్రజాస్వామ్య బద్ధంగా ఎందాకైనా వెళతాం.

– డాక్టర్ రుహిల, జనరల్ సర్జరీ పీజీ, జాయింట్ సెక్రటరీ, ఆర్ఎంసీ–జూడా

అన్నదాతకు సాగు పాఠాలు

- పొలంబడితో చేకూరుతున్న మేలు
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- నిష్ణాతులుగా మారుతున్న రైతులు
- తగ్గిన ఎరువులు, రసాయన మందుల వినియోగం

కరప: రైతులకు సాగు వ్యయం తగ్గించి, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పొలంబడి కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయి. వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ, సాగులో మెళకువలను ఆకళింపు చేసుకుంటూ రైతులు నిష్ణాతులుగా మారుతున్నారు. పొలంబడి ద్వారా తాము నేర్చుకున్న సాగు పాఠాలను ఇతర రైతులకు చెప్పగలుగుతున్నారు.

కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో పొలంబడి నిర్వహించేందుకు రెండు గ్రామాలను ఎంపిక చేశారు. కరప మండలంలో కొరిపల్లి, కాకినాడ రూరల్ మండలంలో నేమాం గ్రామాన్ని ఎంపిక చేసి, ప్రతి వారం పొలంబడి కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ నిర్వహిస్తోంది. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలన్నదే పొలంబడి ముఖ్యోద్దేశం.

రైతులను భాగస్వాములుగా..

ఎంపిక చేసిన గ్రామంలో 30 నుంచి 45 ఎకరాల్లో 30 మంది రైతులను భాగస్వాములను చేసి, వ్యవసాయ శాఖాధికారులు, వీఏఏలు, ఏఈఓలు ప్రతి వారం రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తారు.



డ్రోన్ సాయంతో ఎరువులు, రసాయనాల పిచికారీని రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రతి వారం రైతులను సమావేశపరిచి, ఎప్పటికప్పుడు పంటలో వచ్చే వివిధ మార్పులను సమగ్రంగా పరిశీలించి, వాటిపై చర్చించి, అనుసరించాల్సిన సాగు పద్ధతులు, సమగ్ర పంటల యాజమాన్య విధానాలపై రైతులకు అవగాహన కలిస్తారు. ఇందులో పర్యావరణ హితమైన, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు ఆచరింపజేస్తారు. సాగు ఖర్చు తగ్గించి, నాణ్యమైన పంట ఉత్పత్తులు పెంచడంపై దృష్టి సారిస్తారు. ఈ కార్యక్రమం పూర్తిగా పొలంలోనే 14 వారాల పాటు నిర్వహిస్తారు.

వివిధ పద్ధతులపై అవగాహన

మట్టి నమూనా పరీక్షలు, విత్తనశుద్ధి నుంచి నారుమడి పెంపకం, దమ్ములు, వరినాట్లు, ఎరువులు, పురుగు మందుల వాడకం, నీటి యాజమాన్య పద్ధతులు వివరిస్తారు. ఏ సమయాల్లో ఎరువులు ఎంత మోతాదులో, ఎలా వాడాలో వివరిస్తారు. పంటలో ఉండే శత్రు, మిత్ర పురుగులపై వివరిస్తారు. ఏ సమయాల్లో పంట తెగుళ్లు వస్తాయి, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను సమగ్రంగా వివరిస్తారు.

సాగు చేస్తూ.. శిక్షణ పొందుతూ..

పొలంబడిలోని రైతులు వ్యవసాయం చేస్తూ, శిక్షణ పొందడం ప్రత్యేకత. వీఏఏ టి.స్వర్ణతేజ రైతులను చైతన్యపరచి ప్రతి వారం రైతులు పొలంబడిలో సమావేశపరుస్తారు. ఆ వారంలో చేసిన పనులు, జరిగిన కార్యకలాపాలపై, వరిచేను ఎదుగుదల, పంట తెగుళ్ల ఏమైనా ఉన్నాయా అని చర్చిస్తారు. రైతులు తమ అనుభవాలను తెలుపుతారు. తర్వాత క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు రైతులను పొలాల్లోకి తీసుకెళ్లి పంట పరిస్థితిని, తెగుళ్లకు కారణాలను వ్యవసాయాధికారులు వివరిస్తారు. ప్రధానంగా మొక్కల ఆరోగ్యం, వాతావరణం, భూమిలోని తేమ, కలుపు మొక్కల సాంద్రత, భూమిలోని పోషక పదార్థాల యాజమాన్యం, తెగుళ్లు, కీటకాలు, అవి చేసే హాని లక్షణాలు, మిత్ర కీటకాల ఉనికి, వాటి సంఖ్య డ్రాయింగ్ పేపర్‌పై రాసి, సమగ్రంగా చర్చిస్తారు. అవసరమైన మేరకు ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారు. పొలంబడిలో రైతులు బృందంగా సమావేశం కావడం వల్ల వారిలో ఐకమత్యం, స్ఫూర్తి, నాయకత్వం, సమర్థంగా వనరుల వినియోగానికి, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. డ్రోన్లతో రసాయనాలు, ఎరువుల పిచికారీ, ద్రవ రూపంలో ఉండే నానో యూరియా, నానో డీఏపీ తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పిస్తారు.

ఆధునిక పద్ధతుల్లో సాగు శిక్షణ



ఈ ఏడాది కరప మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి జీఏపీ (గుడ్ అగ్రికల్చరల్ (ప్రాక్టికల్) పొలంబడి నిర్వహిస్తున్నాం. ప్రతి బుధవారం కొరిపల్లిలో రైతులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయంలో అనుసరించే ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, సాగు మెళకువలు వివరిస్తున్నాం. వ్యవసాయం లాభసాటిగా చేసేందుకు ప్రతి వారం పొలంబడి నిర్వహించే గ్రామాల్లో రైతులకు అనుసరించాల్సిన పద్ధతులు వివరిస్తున్నాం. మైక్రో న్యూట్రిషన్ల లోపాలను తగ్గించేందుకు ప్రకృతి రసాయనాల ఆధారంగా తయారు చేసిన న్యూట్రిషన్ల వాడకం, ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేయడం వంటివి చేస్తున్నాం. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం.

– ఏవీ రాజేష్, వ్యవసాయాధికారి, కరప మండలం

చాలా ప్రయోజనకరంగా ఉంది



నేను 3.20 ఎకరాలు సాగు చేస్తున్నాను. సొంత భూమి ఒక ఎకరం, మిగిలింది కౌలుకు తీసుకున్నాను. పొలంబడి వల్ల చాలా నేర్చుకుంటున్నాం. సాగు ఖర్చు తగ్గించుకుని, దిగుబడులు పెంచుకునేలా ప్రతి వారం వ్యవసాయాధికారులు మెళకువలు వివరిస్తున్నారు. మేము నేర్చుకున్న పద్ధతులు ఇతర రైతులకు కూడా చెప్పగలుగుతున్నాం. పొలంబడి రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటోంది.

– దెయ్యాల రాంబాబు, రైతు, కొరిపల్లి

స్పర్జన్ రాజు స్మారక బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఎందరినో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఆర్ఎంసీ పీడీ, దివంగత డాక్టర్ స్పర్జన్‌రాజు మంచి స్నేహశీలి అని, జిల్లా క్రీడారంగానికి ఆయన లేని లోటు తీర్చలేనిదని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి అన్నారు. కాకినాడలోని లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలోని ద్రోణాచార్య బ్యాడ్మింటన్ అకాడమీలో స్పర్జన్ రాజు స్మారక జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ముఖ్యఅతిథి శేషారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకినాడ వైఎంసీఏ అధ్యక్షుడు డాక్టర్ హెన్రీ, కార్యదర్శి గాంధీ మాట్లాడుతూ దివంగత స్పర్జన్‌రాజు వైఎంసీఏకు ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబరుగా ఎనలేని సేవలందించారని కొనియాడారు. అనంతరం పోటీల కోర్టులను శేషారెడ్డి, స్పర్జన్‌రాజు సతీమణి విజయలక్ష్మి, డాక్టర్ హెన్రీ, ద్రోణాచార్య బ్యాడ్మింటన్ అకాడమీ నిర్వాహకుడు రంగబాబు ప్రారంభించారు. ఆరు నుంచి టెన్త్ విద్యార్థులకు సింగిల్స్, డబుల్స్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సీనియర్స్ విభాగంలో సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి పీడీ, వైఎంసీఏ సభ్యులు రవికొర్ అధ్యక్షత వహించారు. పాస్టర్ విక్టర్, జయదేవ్, కె.జాన్‌విక్టర్, కె.వెస్లీ, నవభారత్ విద్యాసంస్థ కరస్పాండెంట్, ఎస్తేర్‌రాణి, బ్యాడ్మింటన్ కోచ్ మూర్తి, పీడీ నూకరాజు, క్రీడాకారులు, స్పర్జన్‌రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. విజేతలకు సెప్టెంబర్ ఏడున జరిగే సంస్మరణ సభలో బహుమతులు అందిస్తామని గాంధీ తెలిపారు.



పోటీల కోర్టును ప్రారంభిస్తున్న శేషారెడ్డి

నిస్వార్థ సేవకు ప్రతి రూపం

ఘనంగా మదర్ థెరిసా జయంతి

కాకినాడ సిటీ: మహోన్నత జీవితంతో, నిస్వార్థ సేవకు ప్రతి రూపంగా మదర్ థెరిసా నిలిచారని పాస్టర్ కేజీ కుమార్ అన్నారు. మదర్ థెరిసా జయంతిని కాకినాడ రూరల్ మండలం తూరంగిలో పీస్ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభాగ్యులకు సేవలందించి, వారి జీవితాలను ఉద్ధరించేందుకు మదర్ థెరిసా చూపిన బాట ప్రపంచానికే ఆదర్శమన్నారు. సేవలోనే మానవత్వం ఉందని చాటిన మహోన్నత మూర్తి మదర్ థెరిసా అని కొనియాడారు. ఆమె చూపిన సేవా మార్గాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. సంఘ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ మండవ దైవ సమాధానం, మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ తదితరులు ప్రసంగించారు. తొలుత మదర్ థెరిసా చిత్రపటానికి నివాళులర్పించారు. పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. స్థానిక నాయకులు సబ్బతి ఫణీశ్వరరావు, సీహెచ్ కొండలరావు, దడాల మోజెస్, బ్రహ్మస్వామి, సన్నపు సహదేవుడు, మాత మరిడియ్య, గొల్లపల్లి బాబులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు రొంగల వెంకటేశ్వరరావు, పులగల శ్రీనుబాబు, జగడం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



తూరంగిలో పేద వృద్ధులకు వస్త్రాలను అందజేస్తున్న సభ్యులు

విజయరాయుడుపాలెంలో..

కరప: మదర్ థెరిసా జయంతిని విజయరాయుడుపాలెం గ్రామంలో పీస్ సేవా సంఘ వ్యవస్థాపకుడు మండవ దైవసమాధానం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మదర్ థెరిసా చిత్రపటానికి గ్రామ సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘువ, కరప ఎస్సై పసుపులేటి శోభన్‌కుమార్, ఉపసర్పంచ్ బూలా శారద, మాతా అప్పారావు, కాదా వెంకటేశ్వరరావు, కాకర్ల దర్శయ్య, సంఘ ప్రతినిధులు, భైభీమ్ యూత్ తదితరులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. సభకు మాతా అప్పారావు అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, దరి చేరలేని రోగులకు ప్రేమతో సేవచేసిన మాతృమూర్తి మదర్ థెరిసా అని కొనియాడారు. సుమారు 180 మంది పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు, వీఆర్వో ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజయరాయుడుపాలెంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై శోభన్‌కుమార్, సర్పంచ్ సీతారామరాఘువ

వీఓఏల సంఘ నేత దీక్ష విరమణ

కాకినాడ రూరల్: అవార్డు పేరిట కలెక్టరేట్‌కు పిలిచి తనను ఘోరంగా అవమానించారని రమణయ్యపేటలోని స్త్రీ శక్తి భవనం వద్ద ఆదివారం నిరసన దీక్ష చేపట్టిన వీఓఏల సంఘ జిల్లా అధ్యక్షురాలు కందా గంగాభవాని అర్ధరాత్రి దీక్షను విరమించారు. డీఆర్‌డీఏకు చెందిన డీపీఎంలు బాబూరావు, రాయ్, వెంకటేశ్వరరావు ఆదివారం రాత్రి గంగాభవానితో చర్చలు జరిపారు. పొరపాటు జరగడం వల్లే అవార్డు అందించలేకపోయామని, అవమానించలేదని వివరించడంతో, గంగాభవాని నిరసనను అర్ధరాత్రి 12.30కు విరమించారు. సోమవారం సాయంత్రం మీడియాతో ఆమె మాట్లాడుతూ కాకినాడ రూరల్ మండలం చాలా పెద్దదని, సుమారు 3,600 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయన్నారు, ఇన్‌చార్జి ఏపీఎంతో పాలన సాగించడంతో అనేక తప్పులు జరుగుతున్నాయని, ఆరుగురు సీసీలకు ముగ్గురే ఉన్నారన్నారు. రెగ్యులర్ ఏపీఓను నియమించాలని డిమాండ్ చేశారు. లఖ్‌పతి అవార్డు వీఓఏలకు ప్రోత్సాహకరమని, అయితే పండూరులో తాను డ్వాకా మహిళలకు పచ్చళ్ల వ్యాపారం కోసం రూ.కోటి రుణాలు మంజూరు చేయించి, రికవరీ కూడా చేయించడంతో తనను అవార్డుకు ఎంపిక చేశారన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం ఉదయం కొందరికి అవార్డు ఇచ్చి, తనకు ఇవ్వకుండా అవమానించారన్నారు. డీపీఎంలు సర్దిచెప్పడంతో దీక్ష విరమించినా, పోరాటం మాత్రం ఆపనన్నారు. ఆమె వెంట పలువురు వీఓఏలు ఉన్నారు.



దీక్ష విరమణ అనంతరం వీఓఏలతో ఉన్న సంఘ నేత గంగాభవాని

యువత మంచి భవిష్యత్తుకు సీవైఎఫ్ కృషి

కాకినాడ సిటీ: గ్రామీణ యువతకు అంతర్జాతీయ స్థాయి నాయకత్వ లక్షణాలు నేర్పించి, మంచి భవిష్యత్తుపై అవగాహన కల్పించే దిశగా 27 ఏళ్లుగా సీవైఎఫ్ ఇంటర్నేషనల్ కృషి చేస్తోందని సంస్థ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు తెలిపారు. సోమవారం స్థానిక మెయిన్ రోడ్డులోని డి–కన్వెన్షన్‌లో సీవైఎఫ్ రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సదస్సును జిల్లా అధ్యక్షుడు మాసా సుధీర్ సన్నీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తిరాజు మాట్లాడుతూ, చెడు మార్గంలో నడుస్తున్న యువతను సన్మార్గంలో పెడుతూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. లండన్‌లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డును తీసుకున్నామన్నారు. ఈ ఏడాది యువజన మహోత్సవాలకు గ్రామీణ స్థాయి యువతకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయి సదస్సు జరిగిందన్నారు. మత్తు పానీయాలకు బానిసలైన యువతకు సాంస్కృతిక, ఆధ్యాత్మికంగా అవగాహన కల్పించడానికి కాకినాడలో అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో సెల్ టు హెల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు, మిరాకిల్ ఇంజినీరింగ్ చైర్మన్ బ్రదర్ డేవిడ్, కల్వరి మినిస్ట్రీస్ పాకా జాన్ రతన్‌సింగ్, మెవెన్స్ మినిస్ట్రీస్ కావూరి ఉత్తేజ్, ది పవర్ ఆఫ్ ప్రేయర్ వర్షిప్ మినిస్ట్రీ డైరెక్టర్ యడ్ల సురేష్, నేషనల్ కో–ఆర్డినేటర్ జాన్ వీక్లిఫ్, స్టేట్ కో–ఆర్డినేటర్ దూది పాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వారికి బహుమతులు ఇస్తున్న ప్రతినిధులు

స్థలాల లీజుపై 28న సమావేశం

కాకినాడ సిటీ: ఏపీఎస్ఆర్టీసీ కాకినాడ డిపో పరిధిలోని పెద్దాపురం, కాకినాడ, సామర్లకోట, పిఠాపురం బస్ స్టేషన్లలో ఖాళీ స్థలాలకు 15 ఏళ్ల కాల పరిమితికి టెండర్లు పిలిచినట్టు డిపో మేనేజర్ మనోహర్ సోమవారం తెలిపారు. బిడ్‌పై వివరణ కోసం ఈ నెల 28న రాజమహేంద్రవరంలో జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో ఉదయం 11.30కు జరిగే సమావేశానికి హాజరై, పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు కాకినాడ డిపో మేనేజర్ 99592 25534, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 73829 24916 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- కృష్ణుని ఆలయాలకు భక్తుల రద్దీ
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- ఉత్సాహంగా ఉట్టికొట్టు మహోత్సవాలు



కాకినాడ అశోక్‌నగర్ గోకులంలో కృష్ణుడు



వలసపాకలలో ప్రత్యేక అలంకరణలో..



కృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఉన్న చిన్నారులతో బ్రహ్మకుమారీలు



ఇంద్రపాలెంలో జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు

బోట్‌క్లబ్: నగరంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. పలు శ్రీకృష్ణుని ఆలయాల్లో ఉదయం స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో ఆలయానికి తీసుకొచ్చారు. స్థానిక అశోక్‌నగర్ గోకులంలో ఉదయం గోపూజ, సహస్ర పుష్పార్చన, నవగ్రహ ఆరాధన, అష్ట కలశ స్నపనాభిషేకం, సహస్ర తులసీ దళార్చన, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గోకులం అధ్యక్షుడు నారాయణం మురళి ఏర్పాట్లు చేశారు. స్థానిక అచ్యుతాపురం గేటు సమీపంలో శ్రీకృష్ణుని మందిరంలో వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక రామారావుపేట శివాలయం సమీపంలో ఉన్న కృష్ణుని ఆలయంలోను, స్థానిక సినిమారోడ్డు సమీపంలో ఉన్న కృష్ణుని ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జేఎన్‌టీయూకే ఎదురుగా ప్రబోధ సేవా సమితి కాకినాడ శాఖ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. పలు కూడళ్లలో రాత్రివేళ ఉట్టి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బాలకృష్ణుడు, గోపికలుగా చిన్నారులు

కాకినాడ రూరల్: కృష్ణాష్టమి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణ మందిరాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు బాలకృష్ణులు, గోపికల వేషధారణలతో అలరించారు. పలు చోట్ల ఉట్టి ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. మండలంలోని వాకలపూడి, వలసపాకల, ఇంద్రపాలెం, కొవ్వాడ, స్వామినగర్ తదితర చోట్ల జరిగిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వాకలపూడి సంస్కృతి విద్యాలయ సన్‌రైజ్ స్కూల్‌లో ఝాన్సీకృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులు ఉట్టి ఉత్సవంలో ఉత్సాహంగా పోటీ పడ్డారు. ఇంద్రపాలెంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పంతం, నానాజీ, వలసపాకలలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పలు గ్రామాల్లోని వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి, సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి గిజాల గంగరాజు, అడబాల రత్నప్రసాద్ పాల్గొన్నారు.

తూరంగిలో..

కాకినాడ సిటీ: కృష్ణాష్టమి సందర్భంగా కాకినాడ రూరల్ మండలం తూరంగి ఏఎస్ఆర్ కాలనీలో జరిగిన వేడుకల్లో చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక నాయకులు ఉట్టి మహోత్సవం నిర్వహించారు. పెద్దఎత్తున కాలనీవాసులు తరలివచ్చారు. స్థానిక నాయకులు సీహెచ్ అజయ్ కుమార్, వీరబాబు, గోవిందరాజులు, విజయ, శ్రీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారి కేంద్రంలో..

నగరంలోని దేవాలయం వీధిలో ఉన్న బ్రహ్మకుమారి కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడి వేషధారణలో అలరించి, నృత్యగీతాలను ప్రదర్శించారు. బ్రహ్మకుమారీలు మీరా, గంగ, లక్ష్మి, వాసవి, సురేఖ ఆయా కార్యక్రమాలను నిర్వహించారు. సుమారు 500 మంది చిన్నారులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తూరంగిలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు



కాకినాడ రూరల్ వాకలపూడిలో ఉట్టి ఉత్సవంలో కృష్ణుడి వేషధారి, చిన్నారి గోపికలు